శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి
- శేరిలింగంపల్లి, చందానగర్ డివిజన్‌లలో పర్యటన



శ్రీదేవి థియేటర్ - అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ ఆమ్రపాలి

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు విస్తరించనున్న రోడ్డు, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద తరచుగా వరద చేరుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాలను శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి విస్తరణకు కూడా త్వరలోనే శాశ్వత పరిష్కరం చూపుతామని చెప్పారు. వెంటనే శ్రీదేవి థియేటర్ రోడ్డులో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ మోహన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ శిరీష, దుర్గప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డా. రవికుమార్, వివిధ విభాగాల అధికారులు, కాంగ్రెస్ నేతలు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం కబ్జాకు యత్నం

అడ్డుకున్న స్థానికులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని జయనగర్ కాలనీకి చెందిన కమ్యూనిటీ హాల్ స్థలానికి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఫెన్సింగ్ నిర్మిస్తుండటంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ భూమిపై తమకు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు శుక్రవారం ఉదయం పనులు చేపట్టడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. స్థానిక కాలనీ వాసులు, మహిళలు వచ్చి ఫెన్సింగ్ వేస్తున్న వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో వారు అక్కడే ఉన్న మహిళలను వీడియో తీస్తూ బెదిరించటంతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని కూకట్‌పల్లి పోలీసులను రప్పించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన వారు తమ వద్ద ఉన్న పత్రాలను, కోర్టు జారీ చేసిన ఇంటరిమ్ ఆర్డర్ కాపీలు చూపించగా వారిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం జయనగర్ కాలనీ లే అవుట్ ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రస్తుతం ఉన్న ఈ ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్‌తో పాటు వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి భూమి తమదేంటూ కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ లే అవుట్ ప్రకారం ఇక్కడ కాలనీకి సంబంధించిన పార్కు ల్యాండ్‌గా అధికారులు ఆర్‌టీపీ ద్వారా ధృవీకరించినట్లు తెలిపారు. అయినా కొన్నేళ్లుగా కొందరు వ్యక్తులు సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తూనే ఉన్నారని వారిపై ఇప్పటికే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ఆర్డర్ పేరు మీద కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

నియోజకవర్గంను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషినగర్ నుండి దీప్తిశ్రీనగర్ కనెక్టివిటీ రోడ్డు, శ్రీలక్ష్మీ వెంకటనగర్ కాలనీ నుండి మక్తమహబూబ్ పేట్ కనెక్టివిటీ రోడ్డు, శ్రీల గార్డెన్స్ కాలనీ, శ్రీ లక్ష్మీనగర్ కాలనీలలో రూ.1కోటి 53లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో వినాయక చవితి వేడుకలు

మియాపూర్: మియాపూర్‌లోని కెనరి ద స్కూల్‌లో శుక్రవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. మట్టి వినాయకుడిని పూజించడం శ్రేష్టమని, పర్యావరణాన్ని పరిరక్షించడం మన బాధ్యతంటూ విద్యార్థుల నాటక ప్రదర్శన అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో స్కూల్ హెడ్ సీనియర్ నవీన్, కో ఆర్డినేటర్ అపర్ణ, ముక్తా, అడ్మిన్ మేనేజర్ మహేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానం వినాయక ఉత్సవాల నిర్వహణకు ముస్తాబైంది.ఈ నెల 7 వ తేదీ నుండి 11వ తేదీ వరకు రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అన్నదానం జరుగుతుందని అర్చకులు మహేష్ , గణేష్ తెలిపారు.

భారీ వర్షం.. జలమయం



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద వరద నీరు



మాదాపూర్ నెక్టార్ గార్డెన్‌లోప్రధాన రోడ్డుపై మోకాలిలోతు నీటిలో ప్రజల అవస్థలు



చందానగర్ ప్రధాన రోడ్డుపై..



గంగారంలో రోడ్డుపై నిలిచిన నీరు

శేరిలింగంపల్లి జోన్ బృందం: జంట సర్కిళ్ల పరిధిలో శుక్రవారం సాయంత్రం గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హాఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలు జలమయ్యాయి. వర్షంతో గణేష్ ప్రతిమలు, పూజాసామాగ్రి కొనుగోలుకు,మండపాల ఏర్పాటు పనులకు ఆటంకం కలిగింది.

లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేత...

లింగంపల్లిలో భారీ వర్షం కురవడంతో అండర్‌బ్రిడ్జి వద్ద వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. గచ్చిబౌలి వైపు వెళ్లాల్సిన వాహనాలను లింగంపల్లి రైల్వే బ్రిడ్జి పై నుంచి గుల్‌మోహర్‌పార్కు మీదుగా మళ్లించారు.

మాదాపూర్ నెక్టార్ గార్డెన్‌లో ..

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో కురిసిన భారీ వర్షానికి మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్‌లో ప్రధాన రోడ్డుపై భారీగా వరద నీరు చేరింది. మోకాలిలోతు నీటిలో రాకపోకలకు ప్రజలు యాతన పడ్డారు. మాదాపూర్ హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా నీరు చేరడంతో తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

గురుకుల విద్యార్థుల కోరిక నెరవేరింది

పాత ఫ్యాకల్టీని తీసుకునేందుకు కార్యదర్శి అంగీకారం

గచ్చిబౌలి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల డిమాండ్ నెరవేరింది. ప్రస్తుతం గౌలిదొడ్డి గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో పాత ఫ్యాకల్టీ స్థానంలో కొత్తవారిని నియమించిన సందర్భంగా పాత వారిని గత నెలలో తొలగించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు 'ఆ సార్లే కావాలంటూ' గురువారం ఆందోళన చేసిన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి వర్షిణి పాత ఫ్యాకల్టీని తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని బాలుర, బాలికల కళాశాలల ప్రిన్సిపల్స్ గణేష్, కల్పన తెలిపారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'మనూ' దూరవిద్య కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో దూరవిద్య కోర్సుల అడ్మిషన్లకు ఏర్పాట్లు చేసినట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) డైరెక్టర్ గుల్షిషన్ హబీబ్ శుక్రవారం తెలిపారు. 'మనూ'లో డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులతో సహా అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు అందిస్తుందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంఏ(ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్), బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారంను సమర్పించడానికి సెప్టెంబర్ 30 ఆఖరు అని అడ్మిషన్ ఫీజును అక్టోబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్(ఎస్‌ఎస్‌యూ) హెల్ప్‌లైన్లు 040-23008463, లేదా 040-23120600(ఎక్స్‌టెన్షన్ -2207,2208) ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

రెండు క్లీనిక్‌లకు రూ.5 వేల జరిమానా, సీజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో ప్రైవేట్ క్లీనిక్‌లను పీఓఎంసీహెచ్ నాగనిర్మల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో ఓ డయాగ్నొస్టిక్స్ అనుమతి తీసుకోకుండా నడుపుతున్నందున వారికి 5 వేల రూపాయల జరిమానాతో బాటు సీజ్ చేశారు.అదేవిధంగా ఓ డెంటల్ క్లీనిక్ అనుమతి తీసుకోకుండా ఇంద్రేశం నుండి పటాన్‌చెరుకు మార్చినందున వారికి ఐదు వేల రూపాయల జరిమానాతో బాటు సీజ్ చేశారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో పూడ్చివేతలు తొలగిస్తాం

రంగలాల్ కుంట, భగీరథ చెరువు పరిశీలన అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్



భగీరథ చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గచ్చిబౌలి: చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని పూడ్చివేతలు తొలగిస్తామని, నిర్మాణాలు చేపట్టొద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం నానక్‌రాంగూడలోని రంగలాల్‌కుంట, భగీరథ చెరువులను ఆయన పరిశీలించారు. రంగలాల్ కుంట బఫర్ జోన్‌లో జయభేరి సంస్థ ఇనుప రేకులు వేయడాన్ని గమనించారు. వారం రోజుల్లో రేకులు తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బఫర్ జోన్‌లో గ్రీనరీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఖాజాగూడలోని భగీరథ చెరువు శిఖం, బఫర్ జోన్‌లను పరిశీలించారు. స్థానికంగా ఉండే కొందరు చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టితో పూడ్చారని రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి అవసరమున్న వారు తరలించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 30, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 40, దొండ 50, దోస 30, ఆలు 40, చామ 50, కీర 35, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 100, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 160, వెల్లుల్లి 280.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మియాపూర్: రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని వెనక నుండి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా బీబీపేట్ తుజాల్పూర్‌కు చెందిన నవీన్ మియాపూర్ మదీనగూడలో ఉంటూ ఓ హోటల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పనికి వెళ్లి తిరిగి అర్ధరాత్రి 11:30 గంటలకు హోటల్ నుండి ఇంటికి స్నేహితుడు కొమ్ము విజయ్ తో కలిసి జాతీయరహదారి వెంబడి వెళ్తున్నాడు. అదే సమయంలో మియాపూర్ నుండి చందానగర్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ఆల్విన్ క్రాస్ రోడ్డు సమీపంలో నవీన్, విజయ్‌లను ఢీకొట్టాడు. దీంతో నవీన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా..విజయ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన కోనేరును శుక్రవారం చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పరిశీలించారు.

అధిక వడ్డీ ఆశచూపి రూ. కోట్లు టోకరా..

బిచాణా ఎత్తేసిన రియల్ ఎస్టేట్ సంస్థ

కేపీహెచ్‌బీకాలనీ: అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజల నుంచి రూ. కోట్లు వసూలు చేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ బిచాణా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటూ శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించారు. కేపీహెచ్‌బీ పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... సురేష్ కుమార్ అనే వ్యక్తి వీ ఓన్ ఇన్‌ఫ్రా గ్రూప్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను స్థాపించాడు. సర్దార్ పటేల్ నగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో ఏడాదిన్నర క్రితం కార్యాలయాన్ని ప్రారంభించాడు. నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ భూములు కొంటూ వ్యాపారం నిర్వహిస్తున్నామని పెట్టుబడి కింద డబ్బులు ఇచ్చిన వారికి పెట్టుబడిని బట్టి నాలుగు శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని ప్రచారం చేసుకున్నారు. ఈ విధంగా మొదట్లో రూ.లక్ష పెట్టిన వారికి నెలకు రూ. 6 వేల వరకు వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కలిగించాడు. తర్వాత వికారాబాద్ జిల్లా, మర్పల్లి మండలం, నర్సాపూర్ గ్రామంలో 30 ఎకరాల స్థలం ఉందని రూ. 5 లక్షలు ఇచ్చిన వారికి ఒక గుంట భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు 25 నెలల వరకు నెలకు నాలుగు శాతం వడ్డీ చెల్లించి అసలు డబ్బులు కూడా తిరిగి ఇచ్చి భూమిని వెనక్కి తీసుకుంటామని నమ్మించారు. దీంతో చాలా మంది రూ. ఐదు లక్షలు చెల్లించగా కొందరికి గుంట భూమి రిజిస్ట్రేషన్ చేశాడు. మరికొందరికి అగ్రిమెంట్లు చేశాడు. అయితే నెల నెలా వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. ఇదే క్రమంలో ఇటీవల కాలంలో రూ.10 లక్షల పథకం అమలులోకి తీసుకువచ్చిన అతను పలువురి నుంచి రూ.10 లక్షలు తీసుకుని కొందరికి చెక్కులు, మరికొందరికి భూమి అగ్రిమెంట్లు చేశాడు. ప్రతి నెలా 2 నుంచి 5లోగా వడ్డీ డబ్బులు చెల్లిస్తూ వస్తున్న సురేష్ కుమార్ ఈ నెల 5వ తేదీ వచ్చినా వడ్డీ డబ్బులు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన కొందరు పెట్టుబడిదారులు సర్దార్ పటేల్ నగర్‌లోని కార్యాలయానికి వెళ్లగా మూసివేసి ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా ఇటీవల కార్యాలయంలోని సామగ్రిని తరలించారని, కార్యాలయం ఖాళీ చేసి వెళ్లిపోయారని చెప్పారు. ఫోన్ చేసేందుకు యత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బాధితులు కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సుమారు 40 మందికి పైగా కేపీహెచ్‌బీ పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేయగా బాధితులు పెద్ద సంఖ్యలో ఉండవచ్చునని భావిస్తున్నారు. సదరు సంస్థపై సైబరాబాద్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, కేసును సదరు విభాగానికి బదిలీ చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు తెలిపారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం..



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ పలుచోట్ల శుక్రవారం మట్టి మట్టి వినాయక ప్రతిమల పంపిణీని చేపట్టారు. శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి హైస్కూల్ భారత్ వికాస్ పరిషత్ నమో గంగా (గచ్చిబౌలి శాఖ) ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. బీవీపీ ప్రముఖ్ అంబిక, బీవీపీ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నమో గంగా సభ్యులు ఎల్.నర్సింహారెడ్డి, లక్ష్మణ్, నివేదిత, సరోజ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలో..

చందానగర్ : హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయం, విశ్వేశ్వరయ్య కాలనీలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు నల్లా సంజీవరెడ్డి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజన్, నితిన్ గౌడ్, ప్రవీణ్, కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో..

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌లో మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హోలిస్టిక్ ఆస్పత్రి యాజమాన్యం ఎండి డాక్టర్ రాంచందర్, డాక్టర్ సుబ్బారావు, సునీత, కాంగ్రెస్ నాయకులు చాంద్‌పాషా, తిరుపతిరెడ్డి, తిరుపతి, బలరామ్‌యాదవ్, నరేష్, గణపతి, శ్రీనివాస్‌చౌదరి పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో .. మట్టి వినాయకుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్‌లో..

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ వార్డు కార్యాలయం నందు డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గోపాల్‌నాయక్, వెంకట్రామిరెడ్డి, మహేష్, సర్దార్, ప్రవీణ్, సురేష్, రాజేష్, కృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



నలగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



విద్యాంజలి హైస్కూల్‌లో.. వినాయక ప్రతిమలను అందజేస్తున్న సతీష్ గౌడ్ తదితరులు

నల్లగండ్లలో

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ నటుడు బీహెచ్‌ఈఎల్ ప్రసాద్ అన్నారు. నలగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. హోప్ ఫౌండేషన్ సహకారంతో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రకృతిలో మార్పుల నేపథ్యంలో మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇలాంటి కార్యక్రమం చేపట్టిన హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు మధుసూదన్‌రావు, కరుణాకర్‌రెడ్డి, విజయేందర్ రెడ్డి, శ్రీధర్, సుబ్బరాజు, విజయ్ రెడ్డి, రమణ విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.